
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
సోమవారం, 11 నవంబరు 2024
5

అతడే ఒక సైన్యం..

- బ్యాడ్మింటన్ క్రీడకు జీవం పోస్తున్న కోచ్ లింగయ్య
- కుమార్తెలతో పాటు 300 మందికి శిక్షణ
- అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో రాణింపు
- ఆటల్లో ప్రతిభ చాటుతున్న గ్రామీణ కుసుమాలు

6



రామసహాయం రాధిక

ఓహియో స్టేట్ గవర్నర్ సలహాదారుగా

ఖమ్మం మహిళ

ఖమ్మంటౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని ఓహియో రాష్ట్ర గవర్నర్ సలహాదారుగా ఖమ్మం నగరానికి చెందిన రామసహాయం రాధిక నియమితులయ్యారు. ఖమ్మం నగరంలో నివసిస్తున్న బుచ్చిరెడ్డి, నిర్మల దంపతుల పెద్ద కుమార్తె రాధిక 2006లో అప్పటి మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల్‌లో ట్రిపుల్‌ఈ విభాగంలో ఇంజనీరింగ్ పూర్తిచేశారు. అనంతరం వివాహం కావటంతో భర్త రఘురాంరెడ్డితో కలిసి అమెరికా వెళ్లారు. చదువులో ప్రతిభావంతురాలైన రాధిక అమెరికాలో వివిధ కంపెనీల్లో ఉన్నత హోదాల్లో పనిచేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా, ఐటీ మేనేజర్‌గా పనిచేశారు. అనంతరం అమెరికాలోని నేషన్‌వైడ్ కంపెనీ సాఫ్ట్‌వేర్ డైరెక్టర్‌గా అత్యున్నత పదవిలో పనిచేశారు. తరువాత ఈనెల 8న ఓహియో రాష్ట్ర గవర్నర్ మైక్ డివైన్‌కు మైనారిటీ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ సలహాదారులుగా నియమితులయ్యారు. ఇందుకోసం జరిగిన వివిధ పరీక్షల్లో రాధిక ప్రతిభ చూపటంతో ఆమెను గవర్నర్‌కు సలహాదారుగా నియమించారు. రాధిక తండ్రి బుచ్చిరెడ్డి వ్యవసాయంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ తన ఇద్దరు కుమార్తెలను ఉన్నత చదువులు చదివించారు. పెద్ద కూతురు రాధిక యూఎస్ఏలో గవర్నర్ సలహాదారుగా నియమితులై ఖమ్మం కీర్తిని ప్రపంచానికి చాటారు.

లెక్క తప్పుతోంది!

- సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణలో లోపాలు
- కుటుంబాల సంఖ్య పక్కాగా ఉండాలంటున్న అధికారులు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది
- ఇంటి నెంబర్ల ఆధారంగానే స్టిక్కర్లు వేస్తున్న వైనం
- సర్వేపై సిబ్బందిలో అవగాహన లోపమే కారణం

ఖమ్మం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ఖమ్మం జిల్లాలో సమగ్రంగా సాగడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా ప్రత్యేక అధికారి, ఉన్నతాధికారులు సర్వే నిర్వహించే ప్రాంతాల్లో నిత్యం పర్యటిస్తూ పరిశీలిస్తున్నా కొందరు క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా సర్వే ఆదిలోనే తప్పుడు నివేదికలు అందినట్లు తెలుస్తోంది. ఇళ్ల సంఖ్యతో పాటుగా కుటుంబాల సంఖ్య పక్కాగా లెక్కించాల్సిన క్షేత్రస్థాయి సిబ్బంది ఇష్టారీతిన స్టిక్కర్లు వేస్తూ వెళ్లారన్న వాదన వినిపిస్తోంది.

కేవలం ఇంటి నెంబర్లవారీగా స్టిక్కర్లు

ప్రభుత్వం ఆదేశాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఉన్న మొత్తం ఇళ్లు.. ఆయా ఇళ్లల్లో ఉంటున్న కుటుంబాలు, ఆయా కుటుంబాల యజమానుల పేర్లు వంటి అంశాలను పొందుపరుస్తూ ముందుగా హౌజ్‌హోల్డ్ లిస్టింగ్ చేపట్టాలని నిర్ణయించారు. అందుకోసం ముందుగానే ఎన్యుమరేషన్ బ్లాక్(ఈబీ)లను రూపొందించి ఆయా బ్లాకుల్లో జరిగే సర్వేను పరిశీలించేందుకు స్పెషల్ ఆఫీసర్లను, సూపర్‌వైజర్లు నియమించారు. సర్వే నిర్వహించేందుకుగాను టీచర్లు, మెప్మా సిబ్బంది, మునిసిపల్, కార్పొరేషన్లలో అంగనవాడీ సిబ్బందిని సైతం నియమించారు. అందులో భాగంగా ముందుగా గ్రామాలు, పట్టణాల్లో నివసించే సంచార జాతుల వారితో సహా మొత్తం ఎన్ని కుటుంబాలు ఉంటున్నాయనే అంశాన్ని ధృవీకరించుకునేందుకు ఆయా కుటుంబాల లెక్క ప్రకారం స్టిక్కర్లు వేయాల్సి ఉంది. కానీ క్షేత్రస్థాయిలో లిస్టింగ్ వెళ్లిన కొందరు సిబ్బంది కేవలం ఇంటి నెంబర్ల లిస్టులు పట్టుకుని తిరుగుతూ తమకు ఇచ్చిన లిస్టు ప్రకారం ఇళ్లను గుర్తించి, ఆయా యజమానుల పేర్లను రాసి స్టిక్కర్లు వేసి చేతులు దులుపుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ఆయా ఇళ్లల్లో నివసించే ఇతర కుటుంబాల సంఖ్య తప్పే అవకాశం ఉందన్న వాదన వినిపిస్తోంది. కాగా లెక్కలు అత్యధికంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో మాత్రమే అత్యధిక తేడాలు వచ్చే అవకాశం ఉన్నట్టు స్పష్టమవుతోంది. మునిసిపల్, కార్పొరేషన్ పరిధిలో ఒక్కో ఇంటి నెంబర్‌తో రెండు, మూడు అంతకంటే ఎక్కువ అంతస్తులు, ఆయా అంతస్తుల్లో పోర్షన్లు కూడా ఉంటాయి. కానీ లిస్టింగ్‌కు వెళ్లిన సిబ్బంది కేవలం ఇంటికి ఒకే స్టిక్కర్ వేస్తూ వెళ్లి పోతుండడంతో ఆయా ఇళ్లల్లోని కుటుంబాల సంఖ్య తగ్గే అవకాశం ఉంది.

సొంతంగా నియమించుకోవడమే కారణమా ?

అయితే ఇలాంటి సంఘటనలు జరగడానికి క్షేత్రస్థాయిలో సర్వేకు వెళ్లిన సిబ్బందికి అవగాహన లేకపోవడమే కారణమని తెలుస్తోంది. సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా స్టిక్కరింగ్‌కు వెళ్లాల్సిన సిబ్బంది తమకు తెలిసిన వారిని పనిలో పెట్టుకుని వారితో స్టిక్కరింగ్ (మిగతా 6వ పేజీలో)

ఆదివారం నాటికి సర్వే వివరాలు ఇలా..

ఖమ్మం జిల్లాలో మొత్తం ఇళ్లు	5,71,240
మొత్తం ఎన్యుమరేషన్ బ్లాక్‌లు:	4118
సర్వే ప్రారంభమైన ఎన్యుమరేషన్ బ్లాక్‌లు:	3150
సర్వే పూర్తయిన ఇళ్ల సంఖ్య:	30,616



ముష్టికుంట్లలో సమగ్ర కులగణన సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో నర్సింహారావు

మునిసిపాలిటీ, కార్పొరేషన్లలో ఇలా...

మునిసిపాలిటీ పేరు	మొత్తం ఇళ్ల సంఖ్య	ఎన్యుమరేషన్ బ్లాక్‌లు	సర్వే ప్రారంభమైన ఈబీలు	సర్వే పూర్తయిన ఇళ్లు
ఖమ్మం కార్పొరేషన్	1,68,875	965	0	0
మధిర	24,286	177	177	714
వైరా	22165	160	160	1829
సత్తుపల్లి	27008	212	212	2371

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో హౌజ్ హోల్డ్ లిస్టింగ్ కొనసాగుతుండగా ఆదివారం నాటికి 90.65 శాతం పూర్తయింది. కార్పొరేషన్ పరిధిలో మొత్తం 965 ఈబీల పరిధిలో 1,68,875 ఇళ్లు ఉన్నట్టుగా గుర్తించగా.. వాటిలో ఇప్పటివరకు 1,53,085 లిస్టింగ్ పూర్తయింది.

ఆదివారం ఒక్కరోజు 61,543 ఇళ్ల లిస్టింగ్ చేసినట్టు అధికారులు వెల్లడించారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న పంచాయతీరాజ్ ఛాంబర్ నాయకులు

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు పింఛన్ ఇవ్వాలి

- జాతీయ పంచాయతీరాజ్ ఛాంబర్ సమావేశంలో నేతల డిమాండ్
- ముగిసిన రెండు రాష్ట్రాల సంయుక్త సమావేశం

6



మంత్రి తుమ్మలను కలిసిన కూరగాయల రైతులు

రైతుబజార్‌లోకి దళారులను రానివ్వవద్దు

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఖమ్మంలో పాత రైతుబజార్ పనుల ప్రారంభం పట్ల రైతుల హర్షం

6



హార్వెస్టర్ తగిలి మహిళా రైతు మృతి

- పొలంలో రివర్స్ చేస్తుండగా ప్రమాదం
- ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి
- పాల్వంచ మండలం సోములగూడెంలో ఘటన

పాల్వంచ, నవంబరు 10: వరికోత మిషన్ తగిలి మహిళా రైతు మృతి చెందిన ఘటన ఆదివారం పాల్వంచ మండలంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. పాల్వంచ మండలంలోని సోములగూడెం గ్రామానికి చెందిన పెద్దినేటి అనసూర్య(53) భర్త అస్వస్థత కారణంగా తానే వ్యవసాయం చేస్తోంది. ఆమె భర్త లక్ష్మయ్య రెండు సంవత్సరాల క్రితం ఓ ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమయ్యాడు. అనసూర్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు పెళ్లి చేసుకుని రాజమండ్రిలో స్థిరపడ్డాడు. కుమార్తెకు సైతం వివాహం చేశారు. చిన్న కుమారుడు రమేష్ చురుకైన వ్యక్తి కాకపోవడంతో అనసూర్య కుటుంబ భారాన్ని తానే మోస్తోంది. తమకున్న అర ఎకరం పొలంలో వరి సాగుచేసింది. ప్రస్తుతం వరి కోతకు రావడంతో కూలీలు అందుబాటులో లేక మిషన్‌తో వరి కోయించాలని మిషన్ తెప్పించింది. ఈ క్రమంలో వరి కోస్తుండగా మిషన్ డ్రైవర్ సారయ్య ఎటువంటి సూచనలు ఇవ్వకుండా మిషన్‌ను రివర్స్ చేశాడు. ఈ సమయంలో మిషన్ వెనుకనే ఉన్న అనసూర్యను ఆ మిషన్ ఢీ కొట్టింది. అనసూర్య కాలుకు తీవ్ర గాయమై రక్తస్రావం అయ్యింది. ఆమె పొలం రోడ్డుకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో కొద్దిపాటి ఆలస్యంతో చుట్టు పక్కలవారు ఆమెను కొత్తగూడెంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన తరువాత నాడీ వ్యవస్థ సమస్య ఉందని, భావించి మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలి చిన్న కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు మిషన్ డ్రైవర్ సారయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పాల్వంచ రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

భద్రాద్రికి పోటెత్తిన భక్తులు

- రామయ్యకు అభిషేకం, స్వర్ణపుష్పార్చన
- శివాలయంలో కార్తీక పురాణ ప్రవచనం

భద్రాచలం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వరుస సెలవులు రావడంతో భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు ఆదివారం అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రాకతో పట్టణంలోని వసతి సముదాయాలు, దేవస్థానం సత్రాలు, కాటేజీలు భక్తులతో నిండిపోయాయి. అలాగే పాపికొండల విహారయాత్రకు సైతం పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు.

భద్రాద్రి రామయ్యకు అభిషేకం, స్వర్ణ పుష్పార్చన

ఆదివారం సందర్భంగా అంతరాలయంలో స్వామివారికి అర్జిత సేవలో భాగంగా పంచామృతాభిషేకం, స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. అలాగే స్వామివారికి నిత్యకల్యాణం వైభంగా నిర్వహించారు. చిత్రకూట మండపంలో నిర్వహించిన సత్యనారాయణస్వామి వారి కల్యాణంలో సైతం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



స్వామి వారి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

శివాలయంలో కార్తీక పురాణ ప్రవచనం

కార్తీక మాసం సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో రోజూ నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన ప్రవచన కార్యక్రమంలో కార్తీక పురాణం విశిష్టతను దేవస్థానం సామవేద పండితులు సన్యాసి శర్మ వివరించారు.



ప్రథమ బహుమతి అందుకున్న నిజామాబాద్ ఖోఖో జట్టు

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల

విజేత నిజామాబాద్

కల్లూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కల్లూరులో గత మూడు రోజులుగా జరుగుతున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-17 బాలికల ఖోఖో పోటీలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్‌జీఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి నర్సింహమూర్తి, క్రీడ పరిశీలికుడు శివరాం చేతుల మీదగా ట్రోఫీ, మెమొంటోలు అందజేశారు. రాష్ట్రంలోని పాత పది జిల్లాల నుంచి అండర్-17 బాలికల విభాగంలో 120 మంది బాలికలు పోటీల్లో పాల్గొన్నారు. ప్రథమ బహుమతి నిజామాబాద్ జట్టు. (మిగతా 6వ పేజీలో)

హౌజింగ్ కార్పొరేషన్

అసోసియేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీగా వెంకట్రామిరెడ్డి



వైరా, నవంబరు 10: తెలంగాణ హౌజింగ్ కార్పొరేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ అండ్ వర్క్ఇన్‌స్పెక్టర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బొగ్గుల వెంకట్రామిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఖమ్మంజిల్లా వైరాకు చెందిన వెంకట్రామిరెడ్డి ఎన్నికయ్యారు. 1984లో వర్క్ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగంలో చేరిన వెంకట్రామిరెడ్డి 2009లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ఈ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. వెంకట్రామిరెడ్డి ఎన్నిక పట్ల రాష్ట్ర అధ్యక్షుడు గవ్వా రవీందర్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, కుమార్, వెంకయ్య, రఘ్‌వీర్, షరీఫ్, ఆంజనేయులు, రమేష్, దుర్గాప్రసాద్ అభినందనలు తెలిపారు.



అతడే ఒక సైన్యం



ఒకవైపు పేదరికం వెంటాడుతున్నా.. పంటి బిగువుతో బాధలను దిగమింగుతూ ఆటపై మక్కువతో గ్రామీణ క్రీడకు జీవం పోయాలని సంకల్పంగా పెట్టుకున్నాడు... తాను ఆడి గెలిచిన ఆటలో ఎన్నో అనుభవాలు, మెళకువలను నవతరం క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు ఉపయోగించి అలుపెరగని శిక్షకుడిగా మూడు దశాబ్దాలకు పైగా బాల్ బ్యాడ్మింటన్ క్రీడకు జీవం పోస్తున్నాడు అమరేసి లింగయ్య. బోనకల్‌ను బాల్ బ్యాడ్మింటన్ క్రీడకు చిరునామాగా మార్చిన శిక్షకుడి పై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

- బ్యాడ్మింటన్ క్రీడకు జీవం పోస్తున్న కోచ్ లింగయ్య
- కుమార్తెలతో పాటు 300 మందికి శిక్షణ
- అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో రాణింపు
- ఆటల్లో ప్రతిభ చాటుతున్న గ్రామీణ కుసుమాలు

బోనకల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన అమరేసి లింగయ్య చిరుప్రాయం నుంచే బాల్ బ్యాడ్మింటన్ క్రీడ పట్ల మక్కువ చూపేవాడు. 1980వ సంవత్సరం నుంచి విద్యార్థి దశలో పలుసార్లు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని అఖిల భారత బ్యాడ్మింటన్ జట్టుకు యూనివర్సిటీ స్థాయిలో ప్రాతినిధ్యం వహించారు. డిగ్రీ పూర్తి చేసిన ఆయన కడు పేదరిక కుటుంబ నేపథ్యం కావడంతో ఆర్థిక పరిస్థితుల వలన చదువుకు స్వస్తి పలికాడు. వివాహం చేసుకొని చిన్న క్యాసెట్ సెంటర్ నడుపుకుంటూ జీవనం సాగించాడు. ఆటలో ఎన్నో విజయాలతో ఎంతో దూరం వెళ్లామనుకున్నా పేదరికం రూపంలో ఆయన ఆశయాలకు గండి పడినా, ఆట పై ఉన్న ఆసక్తి, మక్కువ ఇంకా ఎంతో చేయాలని, ఒక్కడిగా మిగల కూడదని ఆటలో ఎందరినో తీర్చి దిద్దాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు. పాశ్చాత్య క్రీడల మోజులో సంప్రదాయ క్రీడలు కనుమరుగవుతున్న తరుణంలో బాల్ బ్యాడ్మింటన్ క్రీడను బోనకల్‌కు పరిచయం చేశాడు. గత 1997లో బోనకల్ గ్రామంలో శాంతి స్నేహయూత్‌ను ఏర్పాటు చేసి బాల్ బ్యాడ్మింటన్ క్రీడకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించాడు.



300 మంది క్రీడాకారుల రాణింపు

లింగయ్య తన ముగ్గురు కుమార్తెలు బిందు, ఉషారాణి, నిరోషాలకు బాల్యం నుంచే శిక్షణ ఇస్తుండగా వారిని చూసి మిగిలిన వారు ఆట పట్ల మక్కువ చూపి సాధన చేసే వారు. ఏటాకేట క్రీడాకారులు పెరుగుతూ బోనకల్, ముష్టికుంట్ల గ్రామాల నుంచి దాదాపు 300 మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. ప్రతి ఏటా రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లే జిల్లా జట్టులో అత్యధిక క్రీడాకారులు బోనకల్‌కు చెందిన వారే ఉంటారు. రాష్ట్రస్థాయి పోటీలల్లో విన్నర్స్‌గా నిలుస్తూ, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం అనావాయితీగా మారింది. అంతర్జాతీయ స్థాయిలో కూడ బోనకల్ క్రీడాకారులు అత్యుత్తమ క్రీడా ప్రతిభను కనబరిచి అవార్డులు అందుకున్నారు.

అవార్డులు సాధించిన ఆణిముత్యాలు

కోచ్ లింగయ్య కుమార్తెలు ఉషారాణి, నిరోషాలు 15 సార్లు జాతీయ స్థాయి పోటీల్లో రాణించి స్టార్ ఆఫ్ ఇండియా అవార్డును కైవసం చేసుకున్నారు. బోనకల్‌కు చెందిన భూక్యా ఉమ, భూక్యా రమేష్, వెంకటస్వామి, శివకృష్ణ, గోపి, ఎన్. బుజ్జిలతో పాటు పలువురు క్రీడాకారులు స్టార్ ఆఫ్ ఇండియా, ఆల్ ఇండియా బెస్ట్ ప్లేయర్ అవార్డులను కైవసం చేసుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీలలో బోనకల్ క్రీడాకారులు పాల్గొన్న జిల్లా జట్టు విన్నర్స్‌గా నిలవడంతో పాటు ఎన్నో అవార్డులు, ప్రశంసలను దక్కించుకోవడం వెనుక క్రీడాకారులతో పాటు కోచ్ లింగయ్య కృషి వెలకట్టలేనిది.

పేదింటి క్రీడా కుసుమాలు

ఆటగాళ్ల నేపథ్యమంతా కడు పేదరికమే. గిరిజన క్రీడాకారులే అధికం. ఒకవైపు చదువుకుంటూ మరోవైపు సెలవుల్లో పనులకు వెళ్తున్నా క్రీడా సాధనను మాత్రం ఆపలేదు. క్రీడా పోటీలకు జరిగే దూర ప్రాంతాలకు వెళ్లడానికి ఒక్కొక్కసారి ప్రయాణ ఖర్చులు కూడా లేక ఇబ్బందులు పడేవారు. చదువుతో పాటు పనులు చూసుకొమ్మని ఇళ్ల వద్ద తల్లిదండ్రులు పదేపదే చెబుతున్నా శిక్షకుడి శిక్షణ, ఆట పై ఉన్న ఆసక్తి వారిని క్రీడా సాధన వైపుకు నడిపించింది. కుటుంబాల్లో అనుభవిస్తున్న పేదరికం, కష్టాలు ఇవన్నీ క్రీడా సాధనలో వారిలో కసిని పెంచాయి. క్రీడా పోటీలో దిగితే ప్రత్యర్థి జట్టు ఏదైనా సరే వారి బ్యాడ్మింటన్ రాకెట్ వేగానికి తలొగ్గాల్సిందే. ఎన్నో విజయాలు, అవార్డులు సాధించి ఆటలో అందనంత ఎత్తుకు ఎదిగి తమతో పాటు బోనకల్ గ్రామాన్ని జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చే క్రీడా సైనికుల్లా మారారు. వారిని చూసి తన పేదరికాన్ని మరిచి విజయాలే తన ఆస్తిగా సంతృప్తి చెందుతూ నేటికి క్రీడాకారులతో నిత్యం సాధన చేపిస్తూ అభినవ ద్రోణాచార్యుడిగా అందరికి ఆదర్శంగా నిలుస్తున్నాడు అమరేసి లింగయ్య.



బ్యాడ్మింటన్ విజేతలతో కోచ్ లింగయ్య

ఆర్చరీ క్రీడాకారుల్లో ఆందోళన

- జాతీయస్థాయి పోటీలకు ఆన్‌లైన్ ఎంట్రీ క్లోజ్
- నేషనల్స్‌లో ఆడే అవకాశం లేనట్లే



మెడల్స్ సాధించిన ఆర్చరీ క్రీడాకారులు

పాల్వంచ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఆర్చరీ క్రీడాకారుల్లో ఆందోళన నెలకొంది. గుజరాత్‌లో ఈ నెల 15, 16 తేదీల్లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఆన్‌లైన్ ఎంట్రీ ఈ నెల 9వ తేదీన ముగియడంతో క్రీడాకారులు నిరుత్సాహానికి గురయ్యారు. ముందస్తుగా జాతీయ స్థాయి పోటీలకు ఆన్‌లైన్ ఎంట్రీ చేయించకపోవడం వల్ల క్రీడాకారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జాతీయస్థాయి ఆర్చరీ పోటీల ఎంపికలు గత నెల అక్టోబరు 29న కరీంనగర్‌లో నిర్వహించారు. జాతీయస్థాయికి 24మంది ఎంపికయ్యారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి ఆరుగురు విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికై రాష్ట్రస్థాయి పోటీల్లో మెడల్స్ సాధించారు. వీరికి కరీంనగర్‌లో ప్రత్యేకంగా శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసి తగు తర్ఫీదు ఇచ్చారు. అండర్ - 19 బాలబాలికల విభాగాల్లో ఎంపికైన 24మంది క్రీడాకారులను జాతీయస్థాయికి పంపించేందుకు రాష్ట్రస్కూల్ గేమ్స్ సెక్రటరీ ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుని తొలుత జాతీయస్థాయి పోటీలకు ఆన్‌లైన్ ఎంట్రీపోటీలో రాష్ట్ర టీమ్‌ను నమోదు చేయించాల్సి ఉంది.

ఆన్‌లైన్ ఎంట్రీ ఈ నెల 9వ తేదీన ముగియడంతో క్రీడాకారుల్లో అసంతృప్తి నెలకొంది. ఈ నెల 15, 16 తేదీల్లో గుజరాత్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనాలంటే ఎంట్రీ చేయించాల్సి ఉంది. ఆన్‌లైన్ ఎంట్రీ క్లోజ్ కావడంతో తిరిగి ఎంట్రీ చేయించే ప్రయత్నం స్కూల్‌గేమ్స్ సెక్రటరీ, విద్యాశాఖాధికారులు వెంటనే రీఎంట్రీకి ప్రయత్నాలు చేయించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

జాతీయస్థాయిలో ప్రాధాన్యం లేనట్లే..?

రాష్ట్రం తరఫున జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో రీఎంట్రీచేయకుంటే జాతీయస్థాయిలో ప్రాధాన్యం లేనట్లేనని ఆర్చరీ కోచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతియేటా జరిగే జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో రాష్ట్రం తరఫున పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు మెడల్స్ సాధిస్తున్నారని తెలిపారు. ముందస్తుగా క్రీడాకారులను తీసుకెళ్లి పోటీల్లో పాల్గొనే విధంగా తక్షణ ఏర్పాట్లు విద్యాశాఖ, స్కూల్స్ గేమ్స్ అథారిటి అధికారులు చొరవ చూపాలని ఆర్చరీ కోచ్‌లు కోరుతున్నారు.

నేటి నుంచి భద్రాద్రి జోనల్ స్పోర్ట్స్ మీట్

- క్రీడలను ప్రారంభించనున్న మంత్రి శ్రీనివాసరెడ్డి



వివరాలు నమోదు చేసుకుంటున్న క్రీడాకారులు

వైరా, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో భద్రాద్రి పదో జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్ సోమవారం ఖమ్మంజిల్లా వైరాలోని ఆసంస్థకు చెందిన గురుకుల విద్యాలయంలో ప్రారంభం కానుంది. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ క్రీడలను ప్రారంభించనున్నారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జోనల్ అధికారి కొప్పుల స్వరూపరాణి మంత్రితోపాటు పాల్గొనున్నారు. క్రీడల వివరాలు.. ఈనెల 11నుంచి 14వతేదీ వరకు భద్రాద్రి జోన్‌లోని 14గురుకులాలకు చెందిన 1190మంది విద్యార్థినులు క్రీడల్లో పాల్గొంటారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, హ్యాండ్‌బాల్, టెన్నికాయిట్, సెస్, క్యారమ్స్‌తోపాటు అథ్లెటిక్స్ అండర్ 14, 17, 19విభాగాల్లో నిర్వహించనున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సమత ఆధ్వర్యంలో ఇక్కడకు వచ్చే విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నారు. జోనల్ గేమ్స్ ఇన్‌చార్జి కె.శ్రీలత ఆధ్వర్యంలో మార్చ్ ఫాస్ట్ రిహార్సల్స్ నిర్వహించారు. డీసీవో రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ మీసాల సునీత, సంజీవ రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, పి.సాయికిరణ్, పాషా, రాజేశ్వరరావు, రమేష్, విజేత, మీడియా ఇన్‌చార్జి ఐనాల సైదులు పాల్గొన్నారు.

శ్రమజీవులకు బతుకు, భద్రత లేదు: టీయూసీఐ

సత్తుపల్లిరూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అసంఘటిత శ్రమజీవులకు నేడు బతుకు, భద్రత లేదని టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు ఎ. వెంకన్న అన్నారు. ఆదివారం సత్తుపల్లిలోని నీలం రామచంద్రయ్య భవనంలో నిర్వహించిన ఆసంఘ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

ఉత్పత్తి, పంపిణీ రంగాల్లో పనిచేస్తున్న లక్షలాదిమంది హమాలీ, మిల్లు వర్కర్ల పనులు నిలిపివేస్తే ఎక్కడ సరుకులు అక్కడే ఉండిపోతాయని, ప్రజలవద్దకు సరుకులు చేరకపోతే పరిస్థితులు తీవ్ర సంక్షోభంగా మారుతాయన్నారు. అసంఘటిత రంగ కార్మిక సామాజిక భద్రత చట్టం ఏర్పాటు చేయాలని, సంక్షేమ బోర్డును ఏర్పాటుచేసి పనిభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమర్లపూడి శరత్, దరావత్ వెంకటేశ్వరరావు, శ్రీను, శివ, వెంకన్న, చెన్నారావు, కల్యాణ్‌రావు, అప్పారావు, సత్తిబాబు, నరసరావు, యూసఫ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయస్థాయి నృత్య పోటీలు



గ్రూప్ డ్యాన్స్ ప్రదర్శిస్తున్న చిన్నారులు

పాల్వంచ, నవంబరు 10: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రశైల పేరుతో నిర్వహించిన జాతీయస్థాయి నృత్య పోటీలు పాల్వంచవాసులను అలరించాయి. ఆదివారం పాల్వంచ కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని సీతరామ కల్యాణ మండపంలో నిర్వహించిన జాతీయస్థాయి నృత్య పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాలనుంచి 90 మంది కళాకారులు పాల్గొన్నారు. వీరందించిన సోలో, గ్రూప్ ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. జూనియర్స్, సబ్ జూనియర్స్ గ్రూప్ విభాగాల్లో శాస్త్రీయ నృత్య ప్రదర్శన, కూచిపూడి నృత్య ప్రదర్శనలు అందరినీ అలరించాయి. పోటాపోటీగా సాగిన ఈ ప్రదర్శనలకు కడప, అనంతపురం, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, ఖమ్మం, వరంగల్, సత్తుపల్లి, భద్రాచలం, పాల్వంచలతో పాటు పలు ప్రాంతాలకు చెందిన కళాకారులు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. అనంతరం ఉత్తమ ప్రదర్శన కనబరచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. పాల్వంచ కళాకారిణి సంతోషిని నాట్య నిలయం వ్యవస్థాపకులు రమాదేవిరామ్ 2016 నుంచి ఇటువంటి నృత్యు పోటీలను నిర్వహించడం పట్ల కళాభిమానులు అభినందనలందించారు.

భగవంతుడు ఎవరికీ శత్రువు కాదు..

- విద్వాన్ కేఈ లక్ష్మీనరసింహన్
- ఘనంగా ముగిసిన ద్వాదశ సూరి..



'ద్వాదశసూరి వైభవం' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భగవంతుడు ఎవరికీ శత్రువు కాదని విద్వాన్ కేఈ లక్ష్మీనరసింహన్ ప్రవచించారు. ఆళ్వార్ల వైభవం కార్యక్రమంలో భాగంగా ఆదివారం నాడు తిరుమంగై ఆళ్వార్ గురించి వివరిస్తూ.. భగవంతుడికి ప్రజలందరూ ప్రేమ పాత్రులే అన్నారు. పురాణాలు, ఇతిహాస గ్రంథాలలో రాక్షసులను సంహరించినట్లు దాఖలా ఉన్నా వారు ప్రజలను బాధించటం, పీడించటం వల్ల దుష్టశిక్షణ శిష్ట రక్షణ నియమం మేరకు వారిని శిక్షించటం జరిగిందన్నారు. ఆళ్వార్లు దివ్య ప్రబంధాలను జగతికి అందించి సమాజంలో భగవత్ చింతనను పెంపొందించే యత్నం చేశారన్నారు. విద్వన్మణి శ్రీమాన్ వెంకటనరసింహన్ మహాయోగి పేయాళ్వార్ గురించి వివరించగా , భాషా సేవిక కోమండూరి కృష్ణ తొందర ప్పాడి ఆళ్వార్ గురించి ప్రవచించారు.

గ్రంథ ఆవిష్కరణ..

ఆళ్వార్ల వైభవ ప్రవచనాల కార్యక్రమం సందర్భంగా ఆదివారం రాత్రి గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమాన్ని వేద పండితుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ద్వాదశ సూరి వైభవం అనే గ్రంథాన్ని సముద్రాల వెంకట రంగ రామానుజాచార్య స్వామి ఆవిష్కరించారు. శ్రీ వైష్ణవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలలో సంఘం జిల్లా అధ్యక్షుడు వేదాంతం రాఘవాచార్యులు, కార్యదర్శి ప్రసాదాచార్యులు, కోదండ రామాచార్యులు తదితరులు పాల్గొన్నారు. ద్వాదశ సూరి కార్యక్రమం ఆదివారం ఘనంగా ముగిసింది. ఆళ్వార్ల విశిష్టతను తెలియ జేస్తూ పండితుల ప్రవచనాలు మూడు రోజుల పాటు ఖమ్మంలోని ఎన్నెస్పీ క్యాంపు రామాలయంలో జరిగాయి. కార్యక్రమంలో పాల్గొని ప్రవచనాలను చెప్పేందుకు పలు రాష్ట్రాలనుంచి వేద పండితులు హాజరై తమ అంశాలపై ప్రసంగించారు. పన్నెండు మంది ఆళ్వార్ల ఘనతను పన్నెండు మంది వేద పండితులు రోజుకు నలుగురు చొప్పున వివరించారు.

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు పింఛన్ ఇవ్వాలి

- జాతీయ పంచాయతీరాజ్ ఛాంబర్ సమావేశంలో నేతల డిమాండ్
- ముగిసిన రెండు రాష్ట్రాల సంయుక్త సమావేశం

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేలు, ఎంపీల పదవీకాలం ముగిసిన తర్వాత ప్రభుత్వాలు వారికి కల్పిస్తున్నట్లే స్థానిక ప్రజాప్రతినిధులకు పింఛన్ సౌకర్యాన్ని కల్పించాలని జాతీయ పంచాయతీరాజ్ ఛాంబర్ రెండు రాష్ట్రాల సంయుక్త సమావేశం డిమాండ్ చేసింది. ఖమ్మంలో జరుగుతున్న జాతీయ పంచాయతీరాజ్ ఛాంబర్ సంయుక్త సమావేశాలు ఆదివారం ముగిశాయి. ఈ సమావేశంలో ఛాంబర్ జాతీయ అధ్యక్షుడిగా యలమంచిలి బాబూ రాజేంద్రప్రసాద్(ఆంధ్రప్రదేశ్), జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పుసులూరి నరేందర్(తెలంగాణ), జాతీయ ఉపాధ్యక్షుడిగా చింపుల సత్యనారాయణ రెడ్డిని, ఇతర కమిటీ సభ్యులను సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పాత సర్పంచ్‌లు చేసిన గ్రామాభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించకుండా నిలిపేయడం అన్యాయమన్నారు. బిల్లులు రాక సర్పంచ్‌లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, తక్షణమే పాత సర్పంచ్‌లకు బిల్లులను చెల్లించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలను విజ్ఞప్తి చేస్తూ తీర్మానించారు. రాజ్యాంగబద్దంగా ప్రభుత్వం పంచాయితీరాజ్‌కు ఇవ్వాల్సిన నిధులు, విధులు, అధికారాలు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్పంచ్‌లకు కూడా ఓటు హక్కు కల్పించాలని తీర్మానించారు.

సమస్యలపై మొత్తం 15 తీర్మానాలను చేసి రెండు రాష్ట్రాలకు, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేయనున్నట్లు వారు తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీల రాష్ట్ర అధ్యక్షుడు బెల్లం శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వనపాక లక్ష్మీముత్యాలరావు, సింగంశెట్టి సుబ్బరామయ్య, ఎ. రామకృష్ణ, వినోదాజ్, వి. ముత్యాలరావు, శ్రీశైలం, ధనంజయా యాదవ్, లొడిగ వెంకన్నయాదవ్, ముల్లంగి రామకృష్ణారెడ్డి, శశికళా యాదవరెడ్డి, శంకర్యాదవ్, తెలంగాణ రాష్ట్ర నాయకులు పురుషోత్తమరెడ్డి, శ్రీశైలం యాదవ్, ఎంపీపీల తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సామినేని హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లోకి దళారులను రానివ్వవద్దు

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంటౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని 44వ డివిజన్ ఆర్‌డీవో కార్యాలయం పక్కన ఉన్న పాత రైతుబజార్‌ను తిరిగి ప్రారంభించేందుకు పనులు ప్రారంభించటంతో కూరగాయలు పండించే రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును రైతులు నగరశివారులోని ఆయన నివాసంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రైతుబజార్‌లో దళారులను రానివ్వవద్దని సూచించారు. రైతులు ఆధునిక సాంకేతికతో, సేంద్రియ విధానం ద్వారా కూరగాయలను పండించి ప్రజలకు అందించాలన్నారు. కాగా పాత రైతుబజార్‌ను తిరిగి ప్రారంభించటంతో ఖమ్మం నగర పరిసరాల్లో కూరగాయల సాగు చేసే సుమారు 200 మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని రైతులు తుమ్మలతో పేర్కొన్నారు. నాణ్యమైన కూరగాయలు ప్రజలకు అందిస్తామని పేర్కొన్నారు. మంత్రి తుమ్మలను కలిసినవారిలో చెరుకూరి రామారావు, మధు, కృష్ణారెడ్డి, మేళ్లచెరువు బ్రహ్మయ్య, జీళ్లచెరువు వెంకన్న, వెంకటేష్, ప్రభాకర్, రామకృష్ణ, అంబాల శ్రీను తదితర రైతులు ఉన్నారు. ఇదిలా ఉండగా మంత్రి తుమ్మల ఆదివారం నగరంలోని న్యాయవాది కాటంనేని రమేష్ కూతురు వివాహ నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్నారు.



లెక్క తప్పుతోంది!

(5వ పేజీ తరువాయి)

వేయించినట్టుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారికి ప్రభుత్వం నుంచి అందే రెమ్యునేషన్‌లో ఎంతో కొంత ముట్టజెప్పే యోచనలో ఉన్నట్టుగా ప్రచారం జరుగుతోంది. దానితో పాటుగా సర్వేలో సిబ్బంది సరిపోని కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేకంగా మరికొంతమందిని నియమించుకోగా వారికి సర్వేపై అవగాహన లేక ఇలాంటి తప్పిదాలు జరిగినట్టుగా తెలుస్తోంది. అయితే డోర్‌లాక్ వంటి అంశాల పరిశీలనలో భాగంగా లిస్టింగ్‌ను మరోసారి చెక్ చేస్తామనీ ముందే చెప్పిన అధికారులు ఇలాంటి తప్పిదాలను సైతం గుర్తించి కుటుంబాల సంఖ్య తేల్చాలని ప్రజలు కోరుతున్నారు. ఆదిలోనే ఇలాంటి తప్పిదాలు జరిగితే పెద్దమొత్తంలో ప్రశ్నలు ఉండే అసలు సర్వేలో మరిన్ని తప్పిదాలు జరిగే అవకాశం లేకపోలేదు. మున్ముందు ఇలాంటి అంశాలపై అధికారులు దృష్టిసారించి ప్రతిష్టతను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో సీతారాములుకు స్వర్ణం



మెడల్ అందుకుంటున్న సీతారాములు

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల 9, 10 తేదీల్లో జరిగిన 11వ రాష్ట్ర స్థాయి అంతర జిల్లాల యోగా పోటీల్లో ఖమ్మం నగరంలోని కరుణగిరి టీఎన్జీవోస్ ప్రాంతానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి కోమాకుల శీతారాములు ప్రతిభ చూపి ప్రథమ బహుమతి సాధించాడు. నిత్యం గురుదక్షిణ ఫౌండేషన్‌లో యోగా తర్ఫీదు పొందే సీతారాములు 60 సంవత్సరాల పైబడిన వారి విభాగంలో పోటీ పడి స్వర్ణ పతకం సాధించాడు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పతకం సాధించిన ఆయనను గురుదక్షిణ ఫౌండేషన్ యోగా శిక్షకుడు రమేష్, తోటి యోగా సాధకులు అభినందించారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల విజేత నిజామాబాద్

(5వ పేజీ తరువాయి)

ద్వితీయ బహుమతి నల్లగొండ జట్టు, తృతీయ బహుమతి ఖమ్మం జట్టు దక్కించుకున్నాయి. కల్లూరులోని మినీ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 15మందిని జాతీయ ఖోఖో జట్టుకు ఎంపిక చేశారు. డిసెంబరు 8 నుంచి 12 వరకు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో తెలంగాణ రాష్ట్రం తరుపున ఈ జట్టు పాల్గొంటుంది. బహుమతి ప్రధానం కార్యక్రమంలో క్రీడల కన్వీనర్ పి నివేదిత, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి వీరరాఘవయ్య, ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి యస్‌కె రంజాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల నిర్వహణకు రాష్ట్రంలోని పది జిల్లాలోని వ్యాయామా ఉపాధ్యాయులు సహకరించారు.

జాతీయ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఇ. మైథిలీ(నల్లగొండ), బి.అపర్ణ (నిజామాబాద్), యస్.ఐశ్వర్య (నిజామాబాద్), బి.స్వప్న (నల్లగొండ), కె.చందన (నల్లగొండ), వి.శ్రీకావ్య (నల్లగొండ), సీహెచ్.దుర్గాభవానీ (ఖమ్మం), టీ తేజశ్రీ (ఖమ్మం), ఎం. సుప్రియ (రంగారెడ్డి) కె.స్పందన(రంగారెడ్డి), ఇ.సాయికిర్తన(మహబూబ్‌నగర్), కె. భవాని(ఖమ్మం), ఎం. లక్ష్మీప్రియ. డి. ప్రవళిక (నల్లగొండ), జి. శాలీని (వరంగల్)ఉన్నారు.



ద్వితీయ బహుమతి సాధించిన నల్గొండ జట్టు

క్రైం సమాచారం

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

టేకులపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానంతో ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని కోయగూడెంలో ఆదివారం చోటుచేసుకుంది. టేకులపల్లి పోలీసుల కథనం ప్రకారం మండలంలోని కోయగూడెం గ్రామానికి చెందిన పూనెం అశోక్(38) తన భార్యపై అనుమానం పెట్టుకొన్నాడు. దీంతో భార్యభర్తల మధ్య తరచుగొడవలు జరుగుతున్నాయి. మద్యానికి బానిసైన అశోక్ శనివారం రాత్రి ఇంటినుంచి బయటకు వెళ్లి మద్యంమత్తులో గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్మకు పాల్పడ్డాడు. ఆదివారం మృతుని తల్లి పూనెం లక్ష్మీ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇల్లెందు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు టేకులపల్లి ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తికి దేహశుద్ధి

గ్రామంలోకి వేగంగా వచ్చి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన కారు

గంజాయితో పాటు కారు స్వాధీనం చేసుకున్న పోలీసులు


గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న గ్రామస్థులు

భద్రాచలం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భద్రాచలానికి సమీపంలోని ఏపీలోని యటపాక గ్రామంలో ఆదివారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా తెలంగాణలోని చర్ల వైపు నుంచి వస్తున్న వాహనం అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో ఆపేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో పోలీసులను చూసి కంగారు పడిన కారులో ప్రయాణిస్తున్న వారు వాహనంనే వేగంగా యటపాక గ్రామంలోకి వేగంగా వెళ్లింది. దీంతో వాహనం అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మేకల గుంపులోకి ప్రవేశించి విద్యుత్తు స్తంభానికి ఢీకొని ఆగింది. ఈ సమయంలో కారులోంచి ఓ వ్యక్తి బయటకు వచ్చి పరారయ్యాడు. మరో వ్యక్తిని గ్రామస్థులు పట్టుకొని దేహశుద్ది చేసి పోలీసులకు అప్పగించారు. అలాగే కారు ఢీకొన్న సంఘటనలో రెండు మేకలకు కాళ్లు విరిగాయి. ఈ సమయంలో ఆ ప్రాంతానికి చేరుకున్న యటపాక పోలీసులు కారును తనిఖీ చేయగా అం దులో గంజాయి ప్యాకెట్లు ఉండటంతో కారు లో ఉన్న వ్యక్తితో పాటు వాహనంను స్టేషన్‌కు తరలించి నిందితుడ్ని యటపాక పోలీసులు విచారిస్తున్నారు. కారులో 100 కేజీల విలువైన గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు సమాచారం.

అగ్నిప్రమాదంలో రెండిళ్లు దగ్ధం



దుమ్ముగూడెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి లచ్చిగూడెంలో ఆదివారం మధ్యాహ్నం పక్క పక్కనే ఉన్న రెండు తాటాకు ఇళ్లు దగ్ధమయ్యాయి. మిడియం సవిత, మిడియం రాజేష్ ఇంటి వద్ద లేని సమయంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకోగా ధాన్యం, పత్తి, గృహోపకరణాలు, విద్యార్హత సర్టిఫికెట్లతో సహా సర్వం కాలి బూడిదయ్యాయి. పొలం పనులకు ఒకరు, చర్చిలో ప్రార్ధనల కోసం మరొక కుటుంబ సభ్యులు వెళ్లిన క్రమంలో ప్రమాదం జరిగింది. రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు సమాచారం.

పామాయిల్ ఫ్యాక్టరీలో ట్రాక్టర్ ఢీకొని డ్రైవర్ మృతి

దమ్మపేట, నవంబర్ 10(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో ట్రాక్టర్ ఢీకొని మరో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందాడు. ఏపీలోని ఏలూరు జిల్లా, జీలుగుమిల్లి మండలం పి.అంకంపాలెం గ్రామానికి చెందిన తోట వెంకటేశ్వరావు(32) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సంవత్సరం కాలంగా దమ్మపేట మండలం గొల్లగూడెం గ్రామంలోని సోదరి ఇంటి వద్ద ఉంటూ అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో కాంట్రాక్టు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ఫ్యాక్టరీలో పని చేసేందుకు వెళ్లాడు. అయితే ఆదివారం ఉదయం 4గంటల సమయంలో వెంకటేశ్వరరావు తోటి కార్మికులు అతడి సోదరి రావుల నాగమ్మకు ఫోన్ చేసి వెంకటేవ్వరరావుకు ప్యాక్టరీలో దెబ్బలు తగిలాయిని సమాచారం ఇచ్చారు.

వారు ఫ్యాక్టరీకి వెళ్లి చూడగా దెబ్బలు తగిలి పడిపోయి ఉండగా వెంటనే అతడిని దమ్మపేట వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యుడు వెంకటేశ్వర్లు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అయితే అతడు ఫాక్టరీలో పని ముగిసిన తరువాత ఒకచోట నిద్రిస్తుండగా మరో ట్రాక్టర్ అతడిని తొక్కి ఉంటుందని భావిస్తున్నారు. ఈ ఘటనపై మృతుడి తల్లి తోట లక్ష్మి దమ్మపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. కార్మికుడి దమ్మపేట ఎస్‌ఐ సాయికిషోర్‌రెడ్డిని వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందిందని, కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని పోస్టుమార్టం నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

కామెర్లతో బాలుడి మృతి


సాయిచరణ్ (ఫైల్)

గుండాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) కొంత కాలంగా తీవ్ర అనారోగ్యం, కామెర్లతో బాధఎడుతున్న ఓ బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన వెలిశాల సాయిచరణ్(13) కొంతకాలంగా తీవ్ర జ్వరం, కామెర్ల వ్యాధితో బాధపడుతున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కిడ్నీలకు ఇన్‌ఫెక్షన్ రావడంతో మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూనే పరిస్థితి విషమించి మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో స్థానికులు ఆర్థిక సాయం అందించినప్పటికీ ఆ ప్రాణం దక్కలేదు. బాలుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముదిగొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన ప్రకారం నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం గ్రామానికి చెందిన మాతంగి వీరబాబు(38) శనివారం సాయంత్రం ముదిగొండ వైపు నుంచి తన స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గోకినపల్లి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. అతడ్ని 108లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెం దాడు. మృతుడి భార్య వీరలక్ష్మీ ఇచ్చిన ఫిర్యా దు మేరకు సీఐ మురళీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విలేకరిని దూషించిన ఘటనలో కేసు నమోదు

బూర్గంపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విలేకరిని దూషించిన ఘటనలో ఆదివారం బూర్గంపాడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. బూర్గంపాడుకు చెందిన రమేష్ ఓ పత్రికలో విలేకరిగా పని చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా అంశంలో కథనాలు రాయడంతో పాటు సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారనే కారణంతో శనివారం రాత్రి సమయంలో ఇసుక రవాణాకు పాల్పడే నలుగురు వ్యక్తులు దూషించి బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపారు. దీంతో ఆదివారం రమేష్ ఫిర్యాదు మేరకే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బీజేపీ సీనియర్ నాయకుడు దామెర్ల కన్నుమూత


సత్యనారాయణ (ఫైల్)

పెనుబల్లి/ ఖమ్మం బైపాస్‌రోడ్డు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు మేనల్లుడు దామెర్ల సత్యనారాయణ(82) ఆదివారం మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల పలువురు బీజేపీ జిల్లా నాయకులు సంతాపం తెలిపారు.

శతాధిక వృద్ధుడు తిరపతయ్య..

బోనకల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరునోముల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, శతాధిక వృద్ధుడు తెల్లబోయిన తిరపతయ్య(100) ఆదివారం మృతి చెందారు. మృతదేహన్ని పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గాలి దుర్గారావు, నాయకులు గూడా నర్సయ్యశాస్త్రీ, అనుమోలు వెంకటేష్, ములకారపు రవి, అన్నెపోగు కుటుంబరావు, పల్లిపాటి తిరుపతిరావు, బీ.పీ నాయక్, చిర్రా ఆదిలక్ష్మీ, చావల రాజేష్, వెంకటేష్, కార్తీక్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

దారులన్నీ అమ్మవారి వనంలోకే..

- ఆనందోత్సాహాల మధ్య వనదుర్గాంబిక ఆలయంలో వనసమారాధన
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు..
- అమ్మవారికి ప్రత్యేక పూజలు


భక్తుల ఇలవేల్పు వనదుర్గాంబిక అమ్మవారు

అశ్వారావుపేట రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మండలంలోని వేదాంతపురం సమీపంలోని అటవీప్రాంతం అంతా ఆదివారం భక్తులతో నిండిపోయింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు జన సందోహంతో నిండిపోయాయి. కార్తీక మాస పర్వదినాన వేదాంతపురం సమీపంలో దట్టమైన అటవీప్రాంతంలో భక్తుల కొంగుబంగారమై వెలుగొందుతున్న శ్రీవనదుర్గాంబిక సమేత వన లింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం 10వ కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ పరిసరాలను అత్యంత అందంగా ముస్తాబు చేశారు. ఉదయం అమ్మవారికి వివిధ రకాల అభిషేకాలు, అర్చనలు నిర్వహించి అందంగా అలంకరించారు. అలంకరణ అనరంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భారీగా భక్తులు తరలిరావటంతో దర్శనానికి గంట వరకు సమయం పట్టింది. అయ్యప్ప మాలాధరులు, భవాని మాలాధరులు, శివమాలాధరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అశ్వారావుపేట, దమ్మపేట, జీలుగుమిల్లి మండలాలతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు ఐదు వేల మంది వరకు భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రాక కొనసాగింది. భక్తులు అధికంగా రావటం, అటవీమార్గం కావటంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ నిర్వాహకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.


వనలింగేశ్వరుడికి అభిషేకాలు, విశేష పూజలు చేస్తున్న అర్చకులు


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి

జగ్గయపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

నేలకొండపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్య వైశ్యులు, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని, కీలకంగా వ్యవహరించాలని జగ్గయ్యపేట తెలుగుదేశం ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్(తాతయ్య) అన్నారు. ఆదివారం నేలకొండపల్లిలోని అక్కినేని గోపాలకృష్ణయ్య మామిడితోటలో ఆర్యవైశ్యులు నిర్వహించిన మండల స్థాయి కార్తీక వనసమారాధన కార్యక్రమంలో తాతయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తాతయ్య మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలన్నరు. ఆర్థికంగా ఎదుగుతూ, సంపాదించిన దాంట్లో కొంత దాన ధర్మాలకు, సమాజ సేవకు వినియోగించాలన్నారు. ఎక్కడ, ఏరాజకీయ పార్టీలో ఉన్నా ఆర్యవైశ్యులందరూ ఐక్యంగా ఉండాలనిఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. తొలుత ఆర్యవైశ్యులు తోటలో మూకుమ్మడిగా సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఆటా, పాటలతో సంతోషంగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రేగూరి హనుమంతరావు, డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, కుంచకర్ర రాధాకృష్ణ, కొత్తా రమేష్, దోసపాటి చంద్రశేఖర్, కనమర్లపూడి ఉపేందర్, యర్రా నాగేశ్వరరావు, రేగూరి వాసవి, దోసపాటి కల్పన తదితరులు పాల్గొన్నారు. తోట యజమని అక్కినేని నాగేశ్వరరావు దంపతులను సన్మానించారు.


మాట్లాడుతున్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

జాతీయస్థాయి కవి సమ్మేళనంలో గురుకుల ఉపాధ్యాయుడికి ప్రతిభా పురస్కారం


బుచ్చయ్యను సత్కరిస్తున్న దృశ్యం

మధిరరూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం చిలుకూరు గ్రామా నికి చెందిన రావిరాల బుచ్చ య్య సాంఘీక సంక్షేమ గురు కుల పాఠశాలలో ఉపాధ్యా యుడిగా పనిచేస్తున్నాడు. రాష్ట్ర భాషా సంస్కృతి శాఖ సౌజన్యంతో భారత్ కల్చర్ అకాడమీ తెలుగు టెలివిజన్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీ యస్థాయి కవి సమ్మేళ నంలో రావిరాల బుచ్చ య్య ప్రతిభ చూ పి పురస్కారం సాధించాడు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బుచ్చయ్య సమకాలిన అంశం, మణిపూర్ మహిళా మారణకాండ అనే అంశంపై ఉపాధ్యాయుడు బుచ్చయ్య చక్కటి కవితా గానం చేసి ఉత్తమ ప్రతిభ కనపర్చాడు. ప్రతిభ కనపర్చిన బుచ్చయ్యకు జ్ఞాపిక; ప్రశాంసపత్రంతో పాటు ఘనంగా సన్మానించారు.

సమస్యల పరిష్కారమే కమ్యూనిస్టుల ధ్యేయం


సభ్యత్వం అందజేస్తున్న రాష్ట్ర నాయకుడు

బోనకల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పేదల సమస్యలను పరిష్కరించడమే కమ్యూనిస్టుల ధ్యేయమని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో ఆదివారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మాట్లాడుతూ మహిళలకు సామాజిక సమానత్వం, బలహీన వర్గాల వారికి సామాజిక న్యాయం తమ పార్టీ ప్రధాన ఎజెండాగా పేర్కొన్నారు. దోపిడి ఉన్నంత కాలం కమ్యూనిస్టు పార్టీలు ఉంటాయన్నారు. ప్రజల కొరకు కమ్యూనిస్టు పార్టీ నాయకులు సైనికుల్లా పని చేయాలని సూచించారు. పేద ప్రజల కోసం ఎన్నో పోరాటాలను నిర్వహించామని తెలిపారు. పోరాట యోధుల త్యాగలను స్మరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా, మండల నాయకులు ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్‌రావు, ఆకేన పవన్, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, బోయినపల్లి బసవయ్య, కొంగర బాస్కరరావు, బోళ్ల ప్రసాదరావు, జక్కా సుశీల, జక్కా లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఇళ్ల పట్టాలపై రిజిస్ట్రేషన్లు చేయొద్దు

ఖమ్మం రిజిస్ట్రార్ కార్యాలయానికి కేఎంసీ కమిషనర్ లేఖ

ఖమ్మంటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరపాలకసంస్థ పరిధిలోని వైఎస్సార్ కాలనీ. రామన్నపేట. దానవాయిగూడెం ప్రాంతాల్లో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్లపట్టాలపై రిజిస్ట్రేషన్లు చేయవద్దని నగరపాలకసంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య జిల్లా రిజిస్ట్రార్ అధికారులకు లేఖరాశారు. సదరు పట్టాలను జీవో నెంబరు 58 ద్వారా క్రమబద్ధీకరించి ఇంటి నెంబర్లు కేటాయించామని, అయితే సదరు స్థలాలను పలువురు విక్రయించటం, గిఫ్టులు ఇవ్వటం చేస్తున్నారని కమిషనర్ లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జీవోనెంబరు 58ద్వారా క్రమబద్దీకరించిన ఇళ్లస్థలాలను ఇతరులకు బదిలాయించకూడదని, కానీ వాటిని విక్రయించటం, గిఫ్టల రూపంలో ఇవ్వటం చేస్తున్నారని కమిషనర్ పేర్కొన్నారు. సదరు ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయవద్దని రిజిస్ట్రార్‌ను కోరారు. ఆస్తిపన్నుల వసూళ్ల కోసం ఇంటి నెంబర్లు కేటాయించామని, వాటని విక్రయించేందుకు నిబంధనలు లేవని స్పష్టం చేశారు.

బ్రహ్మకుమారీస్ నూతన భవనం ప్రారంభం


భవనాన్ని ప్రారంభిస్తున్న బ్రహ్మకుమారీస్ చీఫ్ సంతోష్ దీదీ

భద్రాచలం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారామనగర్ కాలనీలో బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నూతన భవనంను ఆ సంస్థ నిర్వాహకురాలు సంతోష్ దీదీ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా దేశ వ్యాప్తంగా ఆధ్యాత్మిక సేవలందిస్తున్నామని, భద్రాచలంలో 35 ఏళ్లుగా తమ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తుందన్నారు. ఆధ్యాత్మిక సేవలను మరింత విస్తరించేందుకు నూతన భవనంను నిర్మించామని పేర్కొన్నారు. ప్రజలందరూ ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గోనేందుకు ముందుకు రావాలని కోరారు. అంతకు ముందు పట్టణంలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తె ల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి.రాహుల్, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, తాళ్లూరి ట్రస్టు ఛైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య పాల్గొన్నారు.

జిల్లాలో ఆన్‌లైన్ ద్వారా 60వేల సభ్యత్వాల నమోదు: బీజేపీ



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు

ఖమ్మంబైపాస్‌రోడ్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా 60వేల సభ్యత్వాలు నమోదు చేయిం చారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శీలం పాపారావు పేర్కొన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు శిక్షణ కార్యక్రమం ఆదివారం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈకార్యక్రమంలో పాల్గొన్న పాపారావు మాట్లాడుతూ సభత్వ నమోదు కార్యక్రమం ఈనెల 15న ముగుస్తున్నందున విస్తృతంగా ప్రచారం నిర్వహించి కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి బీజేపీ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రధాని మోదీ పాలన వివరించి సభ్యత్వ నమోదు ముమ్మరం చేయాలని కోరారు. అన్నిరకాల వడ్లకు రూ.500బోనస్ ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం సన్నవడ్లకు మాత్రమే బోనస్ చెల్లిస్తామని రైతులను మోసం చేస్తుందన్నారు. ఎటువంటి షరతులు లేకుండా రూ.2లక్షలు రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్, అసెంబ్లీకన్వీనర్ అల్లిక అంజయ్య సభ్యత్వ నమోదు జిల్లా రిటర్నింగ్ అధికారి నుగ్గుల వెంకటగుప్తా, క్రియాశీల సభ్యత్వ రిటర్నింగ్ అధికారి వక్కలంక సుబ్రహ్మణ్యం, జిల్లా బీజేపీ ఎలక్షన్ అధికారులు సిలివేరు సాంబశివరావు, కోటమర్తి సుదర్శన్, వివిధ నియోజకవర్గాల కన్వీనర్లు, మండల అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

భార్యపై హత్యాయత్నం

● దర్యాప్తు చేస్తున్న కొత్తగూడెం త్రీటౌన్ పోలీసులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యపై భర్త రాళ్లతో దాడి చేసి హత్యయత్నానికి పాల్పడిన సంఘటన కొత్తగూడెం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఛోటు చేసుకుంది.

ఇందుకు సంబంధించిన కుటుంబ సభ్యులు, త్రీటౌన్ పోలీసులు తెలి పిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగూడెం పట్టణ పరిధిలోని సింగరేణి మెయిన్ ఆసుపత్రి ఏరియాకు చెందిన యాకూబ్ పాషా, ఆసిఫా భార్య భర్తలు. వీరి మధ్య తరుచూగా గొడవలు అవుతుండడంతో ఆసిఫా రెండు సంవత్సరాలుగా హనుమాన్ బస్తీలోని తన తల్లి ఇంట్లోనే ఉంటుంది. ఈ క్రమంలో యాకూబ్‌పాషా ఆదివారం రాత్రి ఆసిఫా ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఆసిఫాపై రాళ్లతో తలపై కొట్టి హత్యయత్నంనకు పాల్పడ్డాడు. దీంతో తీవ్ర రక్తస్రావం అవ్వగా స్థానికులు, కుటుంబ సభ్యులు కొత్తగూడెం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

భద్రాద్రి కలెక్టర్ జితేష్ వీ పాటిల్

పాల్వంచలో సర్వే పరిశీలన


పాల్వంచలో కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వీ పాటిల్

పాల్వంచ నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సర్వే ఎన్యుమరేటర్లను ఆదేశించారు. సమగ్ర ఇంటింటి కుటుంబసర్వే ప్రారంభమైన నేపథ్యంలో ఆదివారం కలెక్టర్ పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని బొల్లోరిగూడెం 11వ వార్డులో పర్యటించి సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను పర్యవేక్షించి వివరాల సేకరణలో ఏమైన ఇబ్బందులు కలుగుతున్నాయా అని ఎన్యుమరేటర్లను అడిగి తెలుసుకుని ఇబ్బందుల ఉంటే సూపర్‌వైజర్లకు, ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ సర్వేలో భాగంగా ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు ఇంటింటికి స్టిక్కరింగ్ వేయడం పూర్తి చేశామని శనివారం నుంచి ప్రభుత్వం నిర్దేశించిన ఫారంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను ప్రతి కుటుంబం నుంచి సేకరించి నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఎన్యుమరేటర్లు ఎలాంటి పొరపాట్లు చేయకుండ జాగ్రత్తగా వివరాలను పొందు పర్చాలన్నారు. దాదాపు 57కు పైగా అంశాల్లో వివరాలను నమోదు చేయవల్సి ఉన్నందున ఎన్యుమరేటర్‌కు ఒక సహాయకులను నియమించుకుంటే బాగుంటదని సూచించారు. ప్రతి ఒక్క బ్లాక్‌కు ఒక ప్రత్యేక ఎన్యుమరేటర్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని స్థాయిల స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో తిరుగుతూ సర్వేలో ఏమైన ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలియచేశారు. నమోదు చేసిన వివరాలను గోప్యంగా ఉంచాలని, నమోదు చేసిన వివరాలను ప్రతి ఎన్యుమరేటర్ వారికి కేటాయించిన కేంద్రాల్లో డేటా ఎంట్రి సిబ్బంది ద్వార ఎటువంటి పొరపాటు లేకుండ ఆన్‌లైన్‌లో నిర్థిష్ట సమయంలో నమోదు చేయించాలన్నారు. ఈ సర్వే వలన ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా రూపొందించటానికి అవకాశం ఉందని, ప్రతి ఒక్కరు ఆధార్, రేషన్‌కార్డులు, పట్టాదార్ పాస్ పుస్తకం తదితర వివరాలను తమ వద్ద ఉంచుకుని సర్వే కోసం వచ్చే ఎన్యుమరేటర్లకు అందించి వివరాలను నమోదు చేయించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



నేడు రామచంద్రాపురంలో ఎన్టీయార్ విగ్రహావిష్కరణ

నేలకొండపల్లి,నవంబరు10(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని రామచంద్రాపురంలో సోమవారం సాయంత్రం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత, అన్న స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విగ్రహ నిర్వహణ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. పోలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ శాసనసభ్యులు బక్కని నర్సింహులు, ఖమ్మం పార్లమెంటు అడ్‌హాక్ కమిటీ సభ్యుడు వాసిరెడ్డి రామనాథం అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. తెలుగుదేశం కార్యకర్తలు, అభిమానులు, ఎన్టీయార్ అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ ప్రకటనలో కోరింది.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	36 రూ.
వంకాయ	58
గుత్తి వంకాయ	60
బీరకాయ	38
పచ్చిమిర్చి	44
కాకరకాయ	28
బెండకాయ	30
పొట్లకాయ	50
దోసకాయ	38-68
గోరుచిక్కుడు	58
చిక్కుడు	74
నాటుచిక్కుడు	140
క్యాబేజీ	44
దొండ	30-36
సొరకాయ	28
క్యారెట్	78
క్యాప్సికం	88
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్లు ట్రే (30 గుడ్లు)	175
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	అపుడో ఇప్పుడో ఎపుడో
ఆదిత్య:	క
తిరుమల:	దేవర
సినీ గెలాక్సీ:	ధూంధాం

గోళ్లపాడు చానల్‌ను పునరుద్ధరించాలి

- ఇళ్లల్లో నీరు, పైనుంచి వచ్చే నీటితో మురికికూపం
- డివిజన్‌లో పలు ప్రాంతాల్లో వీధులు చిమ్మచీకట్లు
- వీధి కుక్కలతో భయం భయంగా ప్రజలు
- సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న 28వ డివిజన్

డివిజన్ విజిట్

ఖమ్మంఖానాపురంహవేలి నవంబరు10 (ఆంధ్రజ్యోతి): కార్పోరేషన్ పరిధిలోని 28వ డివిజన్‌లో గోళ్లపాడు చానల్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ చానల్ రోడ్డుకు ఇరువైపుల నివాసాలు ఉండటంతో వాడుకున్న నీటితోపాటు పైనుంచి వచ్చే మురుగు నీరు నిల్వ ఉండటంతో నివాసదారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ పూర్తి స్థాయిలో లేకపోవటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పటంలేదు. డివిజన్ పరిధిలోని పైపుల కంపునీరోడ్, టీచర్స్‌కాలనీ, శ్రీనివాసనగర్, కుమ్మరిబజార్, ప్రకాశ్‌నగర్, కృష్ణుడిగుడి రోడ్, జమ్మిగడ్డ ప్రాంతాలు ఉన్నాయి. డ్రెయినేజీలు లేకపోవటంతో వర్షపు నీరు. ఇళ్లల్లో వాడుకున్న నీరు రోడ్లపైకి వచ్చి ప్రజలకు ఇబ్బందులకు గురవుతున్నారు.





గోళ్లపాడు చానల్ కాలవ, మురుగు పారని డ్రెయినేజీ

28వ డివిజన్ స్వరూపం

డివిజన్ కాలనీలు: పైపుల కంపెనీ రోడ్, టీచర్స్ కాలనీ, శ్రీనివాసనగర్, కుమ్మరిబజార్, ప్రకాశ్‌నగర్, కృష్ణుడిగుడి రోడ్, జమ్మిగడ్డ ప్రాంతాలు ఉన్నాయి.

జనాభా: 8500మంది, ఓటర్లు 5500 మంది.

రేషన్‌షాప్‌లు: నాలుగు, అంగన్‌వాడీ కేంద్రాలు మూడు.

కార్పొరేటర్: గజ్జెల లక్ష్మీ
ఫోన్ నంబర్, 97019 23269

వీధుల్లో చిమ్మచీకట్లు

డివిజన్ పరిధిలో కరెంట్ స్థంభాలు లేకపోవటంతో రాత్రిపూట బైటకు వెళ్లలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. రాత్రి పూట రోడ్లపై పాములు, జెర్రు, తేళ్లు రోడ్లపై సంచరిస్తున్నాయని, విద్యార్థులు ట్యూషన్లకు వెళ్లి వచ్చే సమయంలో భయపడుతున్నామని చెబుతున్నారు. డివిజన్ పరిధిలోని ప్రకాశ్‌నగర్‌లో కొత్తగా రూ.2కోట్ల వైకుంఠధామం నిర్మించారు.

ప్రధాన సమస్యలు

డివిజన్ పరిధిలోని గోళ్లపాడు చానల్ సుందరీకరించాలని, సీసీ రోడ్లు, డ్రెయినేజీలను నిర్మించాలని, 30ఏళ్లనాటి వీటిని తీసివేసి కొత్తగా నిర్మించాల్సి ఉంది. డివిజన్ పరిధిలో ప్రకాశ్‌నగర్‌లోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్థంభాలు ఒరిగి ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోనని భయంభయంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులకు చెప్పిని పట్టించుకోవటంలేదని, వెంటనే వాటిస్థానంలో కొత్త స్థంభాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. రాత్రిపూట కుక్కలు గుంపులు గుంపులుగా రోడ్లపై చేరి ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

మంత్రి సహకారంతో అభివృద్ధి

గజ్జల లక్ష్మీవెంకన్న, కార్పొరేటర్



డివిజన్‌లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో అభివృద్ధి పనులు పూర్తికావొచ్చాయి. రూ.2 కోట్లతో ప్రకాశ్‌నగర్‌లో వైకుంఠధామం నిర్మించాం. ఇంకా రూ.4కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మంత్రి సహకారంతో గోళ్లపాడు చానల్ సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయి. డివిజన్‌లో ఒరిగిన విద్యుత్ స్థంభాలను తొలగించాలని మంత్రి ఆదేశాలు ఇచ్చారు.

గోళ్లపాడు చానల్‌ను సుందరీకరించాలి

కొండ్రు చైతన్యకుమార్, గోళ్లపాడుచానల్ నివాసి



డివిజన్ పరిధిలోని ఉన్న గోళ్లపాడు చానల్‌తో ఇబ్బందులు పడుతున్నాం.ఈ ప్రాంతంలో మురుగు కారణంగా దోమలు చేరి విష జ్వరాలు సంభవిస్తున్నాయి. రోడ్లు, డ్రెయినేజీలు లేకపోవటంతో ఇబ్బందులు తప్పటంలేదు. కరెంట్ సమస్యలు అధికంగానే ఉన్నాయి. గోళ్లపాడు చానల్‌ను సుందరీకరించాలి. రాత్రిపూట కరెంట్ లేకపోవటంతో రోడ్లపైకి రావాలంటే భయమేస్తుంది.

కరెంట్ లైన్ లేక ఇబ్బందులు

జెట్టి లింగరాజు యాదవ్, ప్రకాశ్‌నగర్



డివిజన్ పరిధిలోని ప్రకాశ్‌నగర్‌లో కొన్ని ప్రాంతాల్లో కరెంట్ స్థంభాలు లేకపోవటంతో రాత్రిపూట రోడ్ల వెంట చిమ్మచీకట్లు కమ్ముకుంటున్నాయి. కొన్ని స్థంభాలు ఒరిగి ఉండి ఎప్పుడు పడిపోతాయో తెలియక భయంభయంగా ఉంటున్నాం. రాత్రి పూట చీకట్లలో ఇబ్బందులు తప్పటంలేదు. డివిజన్ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నాం.

పొలాల వద్ద రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఖమ్మంరూరల్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా రైతులు పొలాల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఏదులాపురం సెక్షన్ ఏఈ జిల్లా ప్రభాకర్‌రావు తెలిపారు. మండల పరిధిలోని గుర్రాలపాడులో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మోటార్ల వద్ద విద్యుత్ సరఫరా వైర్లు ఎలా ఉన్నాయి, ఏమైనా ప్రమాదకరపరిస్థితులు ఉన్నాయా అని పరిశీలన చేసుకుని ఆన్ చేసుకోవాలన్నారు. ఏమైనా ప్రమాదకర పరిస్థితి అనిపిస్తే తక్షణమే విద్యుత్ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు. మోటార్లకు కెపాసిటర్లు వినియోగించడంవలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫోర్‌మెన్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం విజయవంతం



పశువులను పరీక్షిస్తున్న వైద్యుడు

ఖమ్మంరూరల్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మద్దులపల్లి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో వెంకటగిరి గ్రామంలో ఆదివారం పశువైద్య శిబిరం నిర్వహించారు.అవసరమైన వాటికి టీకాలు, మందులను అందజేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథబాబు మాట్లాడుతూ రైతుల సంక్షేమ కోసం మార్కెట్ పాలకవర్గం పని చేస్తుందని, రైతులకు అవసరమైన సేవలను అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి ఆంజనేయులు, పశువైద్యాధికారి అనంత హరీష్, పాలకవర్గ సభ్యులు కృష్ణారావు, ప్రసాద్, స్థానిక నాయకులు వెంకటనారాయణ పాల్గొన్నారు.

పేరు ఎలా వచ్చిందంటే ? ట్రంక్‌రోడ్డు..



ఖమ్మంసాంస్కృతికం, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ట్రంక్ రోడ్ ఖమ్మం ప్రధాన వీధుల్లో ప్రత్యేకతను సంతరించుకుంది. ఎంఆర్వో కార్యాలయం నుంచి గుంటుమల్లేశ్వరస్వామి దేవాలయం మీదుగా కాల్వొడ్డుసెంటర్ వరకు ఈ రోడ్ విస్తరించి ఉంది. ఒకప్పుడు ప్రధాన హైవేగా కొనసాగిన ఈరోడ్ ఇప్పుడు నగరంలోని అంతర్గత రోడ్లలో ఒకటిగా మారింది. రాష్ట్రరాజధానిని కలిపే రోడ్‌ను ట్రంక్ రోడ్ అని వ్యవహరిస్తారు కనుక ఈరోడ్‌కు ఆపేరు వచ్చింది. మయూరి సెంటర్ వంతెన ఏర్పాటు కాకముందు ఈరోడ్ మీదుగా వాహనాల రాక పోకలు సాగేవి.. రాష్ట్రరాజధాని హైదరాబాద్‌కు, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు ఈ దారినే ప్రయాణించేవి. నయాబజార్ చౌరస్తా వద్ద మున్నేటి వంతెనమీదుగా హైదరాబాద్ రాకపోకలు ఉండేవి.

ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా

ఖమ్మంటౌన్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన సీపీఎం వన్‌టౌన్ మహాసభలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదినెలలు గడుస్తున్నా.. ఆరుగ్యారంటీలను అమలు చేయడలేదన్నారు. గృహనిర్మాణ పథకం, పింఛన్ల పెంపు ఊసేలేదన్నారు. గతంలో సంక్షేమపథకాల అమల్లో వైఫల్యం చెందిన బీఆర్‌ఎస్‌ను ప్రజలు ఓడించారని, కాంగ్రెస్‌కు కూడా అదే పంథా అనుసరిస్తే పరాభవం తప్పదన్నారు. అరుణ పతాకాన్ని సీనియర్‌నాయకులు వంజాకు లక్ష్మీనారాయణ ఆవిష్కరించగా, షేక్ బేగం, చిన్న శ్రీనివాస్,కూరపాటి శ్రీను అధ్యక్షతన జరిగిన ఈసభలో సీపీఎం వన్‌టౌన్ కార్యదర్శి ఎంఏ జబ్బార్ నివేదికను ప్రవేశపెట్టారు. ఈమహాసభలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ అఫ్రోజ్ సమీనా, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రం పాల్గొన్నారు.

నన్నూరిని సత్కరించిన కూరపాటి

ఖమ్మంమామిళ్లగూడెం, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పార్టీ నాయకుడు, టీటీడీ సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డిని ఆదివారం జిల్లా టీడీపీ నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు సత్కరించారు. హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్లో ఆదివారం జరిగిన పార్లమెంట్ కమిటీల సమావేశంలో పాల్గొన్న కూరపాటి వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఖమ్మం నగర నాయకులు వడ్డెం విజయ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు విజయవంతం

నేలకొండపల్లి, నవంబరు10(ఆంధ్రజ్యోతి):ఆదివారం నేలకొండపల్లిలో నూతక్కి గంగాధరరావు సేవా సమితి, ఖమ్మం కిమ్స్ వైద్యశాలల ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలు విజయవంతమయ్యాయి. రావెళ్ళభవన్‌లో జరిగిన శిబిరంలో 166మంది రోగులను పరీక్షించారు. నెలకు సరిపడా మందులను కేవలం రూ.100లకే అందించారు. ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. శిబిరలో డాక్టర్ హస్నద్‌బాబా వైద్య సేవలందించగా, గ్రామీణ వైద్యులు సహకరించారు. ఏటుకూరి రామారావు, కేవిరెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, పగిడికత్తుల నాగేశ్వరరావు,మంకెనపల్లి నర్సింహారావు సామాల మల్లికార్జున్ తదితరులు వాలంటీర్లుగా సేవలందించారు.



కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో

ఖమ్మం కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో నేలకొండపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.200 మంది రోగులకు వివిధ విభాగాలకు చెందిన వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

మాలలు ఐక్యంగా ఉద్యమించాలి

ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ గుంతేటి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

ఖమ్మంచర్చికాంపౌండ్,నవంబరు10 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి మాలలంతా ఐకమత్యంతో ఉద్యమించాలని ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ గుంతేటి వీరభద్రం పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సమస్యల పరిష్కారంలో మాలలంతా ఐక్యంగా ఉండి కలిసి ముందుకు పోవాలన్నారు. ఈనెల 15న ఖమ్మం నగరంలో జరిగే మాల, మాలఉపకులాల ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈసమ్మేళనానికి చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మాలమహానాడు నాయకులుజి.చెన్నయ్య పాల్గొంటారని తెలిపారు. ఈసమ్మేళనంకు ప్రైవేటు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు హాజరు కావాలని ఆయన కోరారు. ఈసమావేశంలో లింగాల రవి కుమార్, మోటపోతుల బాబురావు, ముడసు జాకబ్, కొరవి దయానంద్, దామళ్ల సత్యం, గుమ్మడి కనకరాజు, పేరం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి మండలం బోదులబండలో ప్రభుత్వ పాఠశాలలో 1975-76 పదోతరగతి చదువుకున్న విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నగరంలోని ఓ హోటల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. 50 సంవత్సరాల క్రితం చదువుకున్న విద్యార్థుల ఒక్కచోట కలవటంతో ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని సందడిగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు టి వెంకట్రావు, సీహెచ్ శివ రామకృష్ణ ప్రసాద్, యల్లయ్య, రామారావు, ఝాన్సీ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బోదులబండలో 1975-76లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు

విద్యార్థుల పట్ల ప్రభుత్వం వివక్ష విడనాడాలి

ఖమ్మంటౌన్,నవంబరు10 (ఆంధ్రజ్యోతి):విద్యార్థుల పట్ల ప్రభుత్వం వివక్ష విడనాడాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్సుమెంట్ స్కాలర్‌షిప్పులను వెటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయం గిరిప్రసాద్‌భవన్‌లో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో స్కాలర్‌షిప్ ఫీజురీయింబర్సుమెంట్ బకాయిలు రూ.7650 కోట్లకు చేరుకున్నాయని, వాటిని విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. బకాయిలను ఒకేసారి విడుదల చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో పేర్కొన్నారని గుర్తుచేశారు. ఇంత వరకు విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి శివ నాయక్, రాకేష్, నాయకులు ప్రసాద్, సునిల్, గణేష్, ఉమా మహేష్, హరికృష్ణ, పాల్గొన్నారు.

విహారయాత్రకు తలసీమియా చిన్నారులు

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): తలసీమియాతో బాధపడుతున్న చిన్నారుల్లో ఉల్లాసాన్ని నింపేందుకు సంకల్పం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఏపీలోని చీరాల బీచ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు ప్రొద్దుటూరి అనిత మాట్లాడుతూ నిత్యం రక్తం ఎక్కించుకుంటూ, మందులు వాడుతున్న చిన్నారులను ఆ బాధ నుంచి బయటకు తీసుకొచ్చేందుకు అనేక కార్యక్రమాలు చేస్తుందన్నారు. ఏటా చిల్డ్రన్స్ డే పురస్కరించుకొని పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది చీరాల బీచ్‌కు చిన్నారులను తీసుకెళ్లినట్లు తెలిపారు. సముద్ర అలల వద్ద చిన్నారుల ఆటలు పాటలతో కేరింతలతో ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, కోశాధికారి పి.రవిచందర్, బాధ్యులు పి.ఉదయ్‌భాస్కర్, ఎన్.ఉపేందర్, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కారేపల్లి మండల సీపీఎం కార్యదర్శిగా నరేందర్



కారేపల్లి నవంబరు10:(ఆంధ్రజ్యోతి)కారేపల్లి మండల సీపీఎం కార్యదర్శిగా కె.నరేందర్ ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సీపీఎం 9వ మండల మహాసభల సందర్భంగా 20మంది సభ్యులతో కూడిన కమిటిని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నరేందర్ మాట్లాడుతూ మండలంలో ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పి.సోమయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్య వీరభద్రం, బొంతు రాంబాబు, మూడు శోభన్, మెరుగు సత్యనారాయణ, కొండబోయిన నాగేశ్వరరావు, వజ్జ రామారావు, దుగ్గికృష్ణ తదితరులున్నారు.

ఆర్యవైశ్యులకు అన్నివిధాలుగా అండగా ఉంటా

» అమ్మఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు నందిని

మధిర, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని అమ్మఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని అన్నారు. మధిర పట్టణ, మండల సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఆర్యవైశ్య వనసమారాధన ఆత్కూరులోని అబ్బూరి మామిడితోటలో వైభవంగా జరిగింది. అనేక మంది దంపతులు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. అనంతరం సహపంక్తిభోజనాలు ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ భట్టి విక్రమార్కకు అత్యంత మెజార్టీ ఇచ్చిన ఆర్యవైశ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. సంఘం పరంగా అభివృద్ధి కార్యక్రమాలకు స్థలం, అంత్యక్రియల సమయంలో కార్యక్రమాల నిర్వహణకు భవనం ఏర్పాటు చేయాలని సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు వనమా సూరి కోరడంతో స్పందించిన ఆమె ఈ విషయాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షు డు వనమా కిరణ్‌కుమార్, మండల అధ్యక్షుడు చారుగుండ్ల నర్సింహమూర్తి, రాజశేఖర్, పల్లపో తు ప్రసాదరావు, కోనా ధనికుమార్, వేమిరె డ్డి శ్రీనివాసరెడ్డి, రంగా శ్రీనివాసరావు, మహంకాళి శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

కల్లూరులో..

కల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని చంద్రుపట్ల రహదారి వైపున గల రమణయ్య మామిడి తోటలో ఆదివారం శ్రీ వాసవీ ఆర్యవైశ్య పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఉల్లాసంగా వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు పట్టణ కమిటీ అధ్యక్షుడు చలువాది నగేష్, కార్యదర్శి దారా సురేష్, మండల అధ్యక్షుడు అనుమోలు శ్రీనివాసరావు, పసుమర్తి రాంబాబు, సముద్రాల పుల్లారావు, సంకా రాంబాబు, చారుగుండ్ల అచ్యుత, దోసపాటి కృష్ణార్జునరావు, గుర్ర వెంకటేశ్వరరావు దోసపాటి శ్రీనువాసరావు తదితరులున్నారు.



చందర్‌రావును సన్మానిస్తున్న కల్లూరు ఆర్యవైశ్యులు

నాసిరకంగా రహదారి పనులు

» పట్టించుకోని అధికారులు

» నాణ్యతాప్రమాణాలు పాటించడం లేదని స్థానికుల ఆందోళన



బీటీ రోడ్డు అంచునే పోసిన మట్టి కుప్పలు

వైరా, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వైరా-మధిర, జగ్గయ్యపేట ఆర్‌అండ్‌బీ రోడ్డులో జరుగుతున్న అభివృద్ధి పనులు మొత్తం డొల్లతనంగా ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో కూడా ఈ పనులపై ఆరోపణలు వచ్చినప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించకపోవడం పట్ల స్థానికులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రూ.12కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులపై స్థానిక ఆర్‌అండ్‌బీ అధికారుల కనీస పర్యవేక్షణ కరువైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సెలవు దినమైన శనివారం ఆర్‌అండ్‌బీ అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ లేకుండానే కాంట్రాక్టర్ నాణ్యతాప్రమాణాలకు తిలోదకాలిచ్చి పనులు చేయటాన్ని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బీటీ రోడ్డు అంచున లేయర్ తీయకుండానే ప్రస్తుతం ఉన్న రోడ్డుపైనే మట్టి నింపి చదును చేసి రోలింగ్ చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గత ఏడాది వైరాలోని జాతీయ ప్రధాన రహదారి దగ్గరి నుంచి 1.8కిలోమీటర్ల మధిర-జగ్గయ్యపేట ఆర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధికి రూ.12కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఈ పనులు చేపట్టినప్పటికీ ఏనాడూ సక్రమంగా జరగలేదు. నత్తనడకను తలపిస్తూ పనుల నిర్వహణలో తీవ్ర జాప్యం చేస్తున్నారనే విమర్శలు సైతం ఉన్నాయి.

కొన్నినెలల కిందట వైరాలోని రెండు గురుకులాల మధ్య దాదాపు పర్లాంగు దూరం లేయర్ తవ్వకుండానే రోడ్డుపైనే మట్టి నింపటంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ పనుల గురించి సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులను ప్రశ్నించగా బీటీ రోడ్డు అంచున ఉన్న మట్టి రోడ్డు లేయర్ తీసిన తర్వాత మాత్రమే గ్రావెల్ నింపుతామని అందుకు భిన్నంగా రోడ్డుపై పోసిన మట్టిని తొలగించి పటిష్టంగా పనిచేయిస్తామని సమాధానమిచ్చారు. అయితే అదే రీతిలో శనివారం వైరా వ్యవసాయ మార్కెట్‌యార్డు సమీపంలో బీటీ రోడ్డుకు రెండువైపులా లేయర్ తీయకుండానే ప్రస్తుతం ఉన్న మట్టి రోడ్డుపైనే నాసిరకం మట్టి తోలి చదును చేసి రోలర్‌తో తొక్కించినా పట్టించుకొనే వారే కరువయ్యారు. ఆర్‌అండ్‌బీ అధికారులు, సిబ్బంది ఆ పనులు జరిగే సమయంలో కనుచూపులో కూడా లేకపోవడాన్ని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల కనుసన్నల్లోనే నాణ్యతాప్రమాణాలను తుంగలో తొక్కుతున్నారని విమర్శిస్తున్నారు. రూ.12కోట్లతో నాలుగులైన్ల రోడ్డు, సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, డ్రెయినేజీ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న తరహాలోనే పనులు జరిగితే నాణ్యతప్రమాణాలు ఎలా ఉంటాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఈ పనులపై నిరంతర పర్యవేక్షణ చేసి నాణ్యతాప్రమాణాలతో నిర్మాణాలు చేయించాలని కోరుతున్నారు.

ఈ విషయమై ఆర్‌అండ్‌బీ డీఈఈ రమేష్‌ను వివరణ కోరగా లేయర్ తీయకుండా మట్టి నింపకూడదని తెలిపారు. వైరాలో జరుగుతున్న పనులను తాను పరిశీలించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

'సర్వేను సమర్ధవంతంగా అమలు చేయాలి'

బోనకల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎన్యూమరేటర్లకు కేటాయించిన ఇళ్లల్లో ఏ ఒక్కటి వదలకుండా ప్రతి ఇంటిని సందర్శించి సర్వేను సమర్దవంతంగా పూర్తి చేయాలని ఆర్డీవో జి. నర్సింహారావు ఆదేశించారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో ఆదివారం ఆయన కుల గణన సర్వేను పరిశీలించారు. ఇళ్ల వద్ద ఎన్యూమరేటర్లు చేస్తున్న సర్వేను తనిఖీ చేశారు. సర్వే విజయవంతం చేసేందుకు గానూ అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దార్ పున్నమ్ చందర్, ఆర్ఐ జి. లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

కారేపల్లి, నవంబరు10(ఆంధ్రజ్యోతి): ఇంటింటా కుటుంబసమగ్ర సర్వే కార్యక్రమం కారేపల్లి మండలంలో ఆదివారం రెండవ రోజు కొనసాగింది. ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన ప్రాంతాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. అయితే మండల కాంగ్రెస్ పార్టీనాయకులు మండలంలో పర్యటిస్తూ సర్వేకు ప్రజలు సహకరించాలని కోరుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు.



కారేపల్లిలో సర్వే చేస్తున్న అధికారులు

వనసమారాధనతో ఆధ్యాత్మిక శోభ..

» ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



ఎమ్మెల్యే రాగమయి దంపతులను సన్మానిస్తున్న పద్మశాలీ సేవాసంఘ బాధ్యులు

సత్తుపల్లిరూరల్, నవంబర్10 (ఆంధ్రజ్యోతి): కార్తీక వనసమారాధనతో ఆధ్మాతిక శోభ వెల్లివిరుస్తోందని, చిన్నాపెద్దా బేధాభిప్రాయాలు లేకుండా అందరూ అభివృద్ధి సాధించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సత్తుపల్లి పట్టణ పద్మశాలీ సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మెట్టాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పద్మశాలీ కార్తీక వనసమారాధన ఉత్సాహంగా సందడిగా సాగింది. ఈ కార్యక్రమంలో తాము భాగస్వాములవ్వడం ఆనందంగా ఉందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో మంచి అనుబంధాలను పెంపొందించే విధంగా దోహదపడతాయని తెలిపారు. అన్నివర్గాల సంక్షేమానికి, అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం తోడ్పాటు నందిస్తుందని, వచ్చే ప్రతి ఎన్నికలలో తమను ఆశీర్వదించాలని ఆమె కోరారు. అంతకముందు ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తమ కుటుంబ సభ్యులతో తరలివచ్చి ఉసిరి చెట్టుకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. చిన్నారులు, మహిళలకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, పద్మశాలీ నాయకులు కమర్తపు మురళీ, శ్రీనివాసబాబు, వంగరి పద్మారావు, పర్వతం నాగేశ్వరరావు, కంకటి వెంకటేశ్వరరావు, వావిలాల పుల్లయ్య, తిమ్మిడి రత్తయ్య వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, నారాయణ రావు, దుర్గారావు, రామకృష్ణ, బాబ్జీ, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

గౌడల సమస్యల పరిష్కారానికి ముందుంటా..

పెనుబల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గౌడ కులస్థులు అందించిన సహకారాన్ని మరువమని వారి సమస్యలను పరిష్కరించేందుకు ముందుంటానని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి హామీ ఇచ్చారు. ఆదివారం పెనుబల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయ్‌కుమార్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం పెనుబల్లి మండల గౌడసంఘం ఆధ్వర్యంలో జరిగిన గౌడ వనసమారాధనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ నిర్మాణానికి స్థలాన్ని విరాళం ఇచ్చిన చీపు నర్సింహారావు దంపతులు, విగ్రహాన్ని విరాళంగా ఇచ్చిన నాగుల వెంకట కృష్ణప్రసాద్(ఎన్‌వీకే)లను ఎమ్మెల్యే దంపతులు సన్మానించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు ఈవీ.రమేష్, పంది వెంకటేశ్వరరావు, బొర్రా వెంకటకోటేశ్వరరావు, వేముల రవికుమార్, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, కుక్కా శ్రీనివాసరావు, బండి వెంకటేశ్వర్లు, బొర్రా వెంకటేశ్వర్లు, చిలిబోతుల చెన్నారావు తదితరులున్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం..

తల్లాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. ఆదివారం తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సన్నరకం ధాన్యం పండించే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.500బోనస్ అందజేస్తుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ తూము వీరభద్రరాజు, నాయకులు కాపా సుధాకర్, జక్కంపూడి కిషోర్, పాసంగులపాటి లక్ష్మీనారాయణ, పోట్రు శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



పెనుబల్లి గౌడ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాగమయి

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

» ఆర్డీవో నర్సింహారావు



ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో నర్సింహారావు

చింతకాని, నవంబరు 10: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని ఆర్డీవో నరసింహారావు కోరారు. ఆదివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. యువతీ, యువకులు ఓటు హక్కు నమోదు చేసుకునేలా అధికారులు, ప్రజాప్రతినిధులు వారికి అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం మండల కేంద్రంలో కుటుంబ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, ఆర్ఐ రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

మధిర టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మధిరలో పాఠశాలల్లో పోలింగ్ బూత్‌లను ఆదివారం తహసీల్దార్ రాంబాబు పరిశీలించారు. ఓటు హక్కు నమోదు గురించి అవగాహన కల్పించారు. 18ఏళ్ల నిండిన యువతీయువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని అన్నారు. సమగ్ర సర్వేకు సంబందించి ఎన్యూమరేటర్లకు పలు సూచనలు చేశారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.



మధిరలో పోలింగ్ బూత్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రాంబాబు

వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలుద్దాం

» మాజీమంత్రి జలగం ప్రసాదరావు



జలగం ప్రసాదరావును సన్మానిస్తున్న సంఘ బాధ్యులు

సత్తుపల్లి, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలుద్దామని మాజీమంత్రి జలగం ప్రసాదరావు అన్నారు. ఆదివారం స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయం ఎదుట మామిడితోటలో నిర్వహించిన పద్మనాయక వెలమవారి వనసమారాధన ఘనంగా నిర్వహించారు. వనదేవతల సమక్షంలో సత్తుపల్లి, పెనుబల్లి, దమ్మపేట, అశ్వారావుపేట, అన్నపురెడ్డిపల్లి మండలాల వెలమ బంధువులంతా ఒకే వేదికపై చేరని ఆ ఆత్మీయ కలయిక ఆద్యాంతం అనుభూతులను మిగిల్చింది. ఉదయం గోపూజ, ఉసిరి చెట్టుకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన గావించగా ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వెలమ కుటుంబ సభ్యుల అభివృద్ధి, సంక్షేమానికి పలు తీర్మానాలు చేశారు. సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి పేద కుటుంబాలకు బాసటగా నిలిచేందుకు దాతల నుంచి విరాళాలు సేకరించారు. అనంతరం ఆటపాటలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, సంఘ బాధ్యులు గోన శ్రీలత, చింతల ఉదయశ్రీ, దామెర రంగారావు, సాగి వెంకటేశ్వరరావు, దామెర రమేష్, బోయినపల్లి సందీప్, అమరవరపు కృష్ణారావు, కటికనేని చిన్ని, రావు రాజేష్, గోన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు వృథాకావు

» న్యూడెమోక్రసీ నాయకులు డేవిడ్‌కుమార్, నాగన్న



మాట్లాడుతున్న డేవిడ్‌కుమార్

కొణిజర్ల, నవంబరు10(ఆంధ్రజ్యోతి): అమరవీరుల త్యాగాలు వృథా కావని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు డేవిడ్‌కుమార్, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న అన్నారు. అమరవీరుల వారోత్సవాల సందర్భంగా మండల పరిధిలోని రామనర్సయ్యనగర్ గ్రామంలో జరిగిన బహిరంగసభలో వారు పాల్గొని మాట్లాడారు. ఆనాడు పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోట్ల రామనర్సయ్య లాంటి వందలమంది విప్లవకారులను 1975 ఎమర్జెన్సీలో వెంగల్‌రావు ప్రభుత్వం పొట్టనపెట్టుకుందని తెలిపారు. అమరవీరుల ఆశయసాధనకోసం పోరాడతామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ, వెంకట్రామిరెడ్డి, పౌర హక్కుల సంఘం నాయకులు విప్లవకుమార్, పరకాల లక్ష్మి, సబ్‌డివిజన్ కార్యదర్శి షేక్ ఖాసీం, కిషన్, శంకర్, పఠాన్‌ఖాసీంఖాన్, దుసురు, సీతయ్య, చందు, బాబు తదితరులు పాల్గొన్నారు.


దాసుల సంఘం మండల కార్యవర్గం ఎన్నిక

కల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) కల్లూరులో ఆదివారం దాసుల సంఘం (మాలదాసరి) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దాసుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జు సుధాకర్, జిల్లా దాసుల సంఘం అధ్యక్షుడు పట్టయ్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌దాస్ ల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. కల్లూరు మండల దాసుల సంఘం అధ్యక్షుడిగా గుంటక మోహన్‌దాసు, ఉపాధ్యక్షుడిగా జి పుల్లారావు, ప్రధాన కార్యదర్శి దశవర్ధన్, కార్యదర్శిగా వెంకటదాసు, కోశాధికారి మురహరి, ప్రచార కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, మహిళ కార్యదర్శిగా పుల్లమ్మ, విజయలక్ష్మిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక విజ్ఞాన్ పాఠశాలలో దాసుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గిరిబాబు పర్యవేక్షణలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పరిధిలో గల పలువురు దాసులు పాల్గొన్నారు.



నూతనంగా ఎంపికైన కల్లూరు దాసుల సంఘం కమిటీ

ప్రకృతి పచ్చని తోరణాలు



రామకృష్ణాపురంలో తోరణంగా మారిన పచ్చని చెట్లు

చింతకాని, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): హరితహారంలో భాగంగా గ్రామాల్లో నాడు నాటిన మొక్కలు నేడు పెరిగి ఆకుపచ్చ తోరణాల మాదిరిగా ప్రయాణికులకు స్వాగతం పలుకుతున్నాయి. మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలోకి ప్రవేశించే ప్రవేశ మార్గం వద్ద రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలతో రోడ్డుపై పచ్చదనం సంతరించుకుంది. రెండు వైపులా ఏపుగా పెరిగిన చెట్లు గ్రామంలోకి వచ్చే వారికి స్వాగతం పలుకుతున్నట్లు పచ్చని తోరణంగా మారి వాహనదారులను, పాదచారులను, చూపరులను విశేషంగా ఆకర్షిస్తూ ఆకట్టుకుంటున్నాయి.

తిరుపతి దేవస్థానం బోర్డు డైరెక్టర్‌ని కలిసిన సుధాకర్



నర్సిరెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు తాతా సుధాకర్ దంపతులు

కొణిజర్ల, నవంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం డైరెక్టర్‌గా నియమితులైన నందూరు నర్సిరెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లో మండల టీడీపీ అధ్యక్షుడు తాతా సుధాకర్, సతీమణి తాతా మాధవి దంపతులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ నుంచి నర్సిరెడ్డికి అవకాశం ఇవ్వడం ఆనందంగా ఉందని సుధాకర్ అన్నారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డికి భద్రాచలం రాములవారి ఫొటోతో ఉన్న జ్ఞాపికను వారు అందజేశారు.

నేడు రామచంద్రాపురంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

» హాజరుకానున్న మాజీ ఎమ్మెల్యే నర్సింహులు

నేలకొండపల్లి, నవంబరు10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో సోమవారం తెలుగు జాతిఆత్మ గౌరవం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత, నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విగ్రహ నిర్వహణ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ శాసనసభ్యులు బక్కని నర్సింహులు, ఖమ్మం పార్లమెంటు అడ్‌హాక్ కమిటీ సభ్యులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

కావున తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అన్న ఎన్టీయార్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ ప్రకటనలో కోరింది.